# కొడవటిగంటి

1969 మార్చి 27. సాయం సమయం. ఆనాడు ఆదివారం,

"తెలుగు సాహితి" సభ్యులు విఖ్యాత తెలుగు సాహితీకారుడు డాక్టర్ గిడుగు సీతాపతిగారి మరణానికి సంతాపసూచకంగా రెండునిమిషాలు మౌనంగా నిలుచున్నారు. "తెలుగు సాహితి" ఉపాధ్యక్షులు శ్రీగంటి జోగి సోమయాజి. సీతాపతిగారు వివిధ సాహిత్య ప్రక్రియలలో చేసిన కృషిని సంస్మరించారు.

ఆ తర్వాత సాహిత్య సభ ప్రారంభమయింది.

డాక్టర్ మహీధర నళినీ మోహనరావు. స్వాగతం పలుకగా శ్రీ రా. సత్యనారాయణ నాటి ప్రధాన అతిథి శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారిని పరిచయం చేశారు, శ్రీ తెన్నేటి విశ్వనాథం "తెలుగు సాహితి" తరఫున శ్రీ కొడవటిగంటికి పుస్తకాలనూ, ఒక దారు ఫలక చిత్రాన్ని బహూకరించారు.

అటుపిమ్మట సాహిత్యచర్చ మొదలయింది.

"మనమందరమూ రచయితలమనే అనుకుంటున్నాము గాని మనం జానికి పాఠకులలో నూరింట ఒక్కరి దృష్టినికూడా ఆకర్షించలేక పోతున్నాము, "మీ" "మా" పాఠకులూ, వారికి కావలసిన రచనల సంగతి కాదు. ఈనాడు జనాభాలో 10 శాతమయినా అక్షరాస్యులున్నారు. అయినా, అదేమి ఖర్మమో ఏ తెలుగు పుస్తకమయినా పట్టుమని వెయ్యి ప్రతులమ్మవు

కారణం ? రచయితలు సరిలేరా? కాదు. సరైన విమర్శలు, విమర్శకులు లేరని నానమ్మకం. ప్రాశ్చాత్య దేశాలలో విమర్శలవల్ల నశించిపోయిన రచయితలున్నారు; విమర్శలు పునరుజ్జీవింప చేసిన రచయితలున్నారు. అక్కడి సాహిత్యరంగంలో విమర్శ అంతటా శక్తివంతమైన పాత్రను నిర్వహిస్తుంది, కానిఇక్కడ మన పరిస్థితి తద్భిన్నంగావుంది వస్తున్న కొద్దిపాటివిమర్శలలో నయినా రచనకన్నా, రచయిత ప్రధానమవుతున్నాడు. ఈ రంగంలో మనకన్నా హిందీభాష పైమెట్టు మీద వున్నట్టుంది, వారిలో మౌలికమైన రచనలు ఎక్కువలేవు. కాని తెలుగులో మౌలికమైన రచనలెక్కువ; విమర్శలు తక్కువ'' అన్నారు శ్రీ కొడవటి కుటుంబరావు,

“రెండుమూడు దశాబ్దాల క్రిందకన్నా ఈనాడు అధిక సంఖ్యాకులు రచనకు పూనుకోవడమేగాక తమవ్యక్తిత్వపు ముద్రవున్న రచనలెక్కువగా చేస్తున్నారు. ఇది నిజమేనా? నిజమయితే కారణం ఏమిటయివుండవచ్చును ? అన్న ప్రశ్నలకు సమాధానమిస్తూ శ్రీ గంటిజోగి సోమయాజి ఇలా అన్నారు.

“తెలుగు సాహిత్యంలో స్థూలంగా రెండు యుగాలు కనపడతాయి. మొదటిది సంస్కృత యుగం; రెండవది ఆంగ్లయుగం. మొదటి యుగానికి కర్త నన్నయ్య అయితే, రెండవదానికి వీరేశలింగం కర్త. నేడు అటు సంస్కృతమూ బొత్తిగారాదు; ఆంగ్లమూ, కొద్దికొద్దిగావచ్చు. అటూఇటూ కూడా అధారంలేని నేటి రచయితలు, సాహితీపరులూ తమ్ముకదిలించిన దానిని, తాము చెప్పబూనిన దానిని, తమ ఆలోచనను అచ్చంగా తమదే అయినవిధంలో, ఇంకెట్టి ప్రభావమూ లేకుండా, చెప్పబూనుతున్నారు. కనుక నేటి తరం రచయితల భావ ప్రకటనలో స్వయం ప్రతిభ కనపడుతున్నది.

తర్వాత చర్చ “కన్యాశుల్కం” నాటకం మీదకు మళ్ళింది. కన్యాశుల్కపు మొదటి, రెండవ ముద్రణ ప్రతులను పరిశీలించాక, ఆ నాటకంలోని కొన్నిపాత్రల నామధేయాలూ అవీ చూశాక మొదట గురజాడ దానిని హాస్యభరితమైన నాటకంగామాత్రమే వ్రాయ నుద్దేశించాడనీ, కానీ రచన మొదలయ్యాక ఆ పాత్రలు పెరుగుతూపోయాయని, ఆ తర్వాతే నాటకానికి ఒక స్పష్టమైన సాంఘిక లక్ష్యంకూడా సిద్ధించి వుంటుందనిపిస్తుందని శ్రీ కుటుంబరావు అన్నారు. గిరీశం పాత్ర గురించి మాట్లాడుతూ ఆయన

ఏవిధంగాచూచినా గిరీశంది కొందరంటున్నట్లు "శ్రుతపాండిత్యం" కాదనీ, గిరీశంలో మరొక్క గొప్ప విశేషం అతడు నాటకమంతటాకూడా (ముఖ్యంగా బుచ్చమ్మవద్ద) ఎంతో హుందాగా, పెద్దమనిషితనంతో వ్యవహరించడం అనీ ఆయన అన్నారు. తాము యువకులుగావున్న రోజులలో కన్యాశుల్కంలోని ఏదో ఒక సంభాషణో ఛెణుకోలేకుండా ఇద్దరుమిత్రుల సంభాషణ సాగేది కాదని ఈనాటివారికి "కన్యాశుల్కం"తో బొత్తిగా పరిచయంలేదనీ అన్నారు కుటుంబరావు.

శాంతినికేతన్ కలకత్తాలో వుందంటూ వ్రాసే రచయితలపట్ల తీవ్రంగా సాగిన చర్చ చివరకు- "మంచి కథ అన్నదానికి నిర్వచనం ఏమిటి?" అన్న ప్రశ్నగా తేలింది. అది కష్టమని, దాని నిర్వచనం వ్యక్తికీ, వ్యక్తికీ మారవచ్చుననీ, అయినా "ఒక లక్ష్యం అంటూ నిర్ణయించుకుని ఆ లక్ష్యానికి ఎక్కుపెట్టి దానిని గురితప్పకుండా కొట్టగలిగిన కథను" మంచికథగా వర్ణించవచ్చునని కొడవటిగంటి చెప్పారు.

"ఈ రెండు మూడు దశాబ్దాలలో శిష్టవ్యావహారికం బాగా అభివృద్ధి చెందింది. ఇంకా అభివృద్ధిచెందుతుంది. అయినా అన్నిచోట్ల అదిచలామణీ అవుతుండగా ఒక్క విశ్వవిద్యాలయాలలో మాత్రం ఇంకా మడికట్టుకు కూర్చోనేల?" అని ప్రశ్నించారొక సదస్యులు. శిష్టవ్యావహారికానికొక సమగ్రమైన వ్యాకరణం రావాలన్నారు కొందరు. అది కష్టమని కొందరన్నారు. అట్లాంటి వ్యాకరణ ప్రయత్నం జరిగిందని చెప్పారొకరు. వ్యాకరణంలేకపోతే పోయే, శిష్టవ్యావహారిక ప్రయోగంకోశం వంటిదొకటి తయారు చెయ్యవచ్చుగా - అని సూచించారు కుటుంబరావు. విశ్వవిద్యాలయాలలో నయినా తెలుగు పాఠ్యాంశంగా వున్నప్పుడు ఇంక విధిలేకపోతే గ్రాంధికం వాడడం, ఇతర విషయాలను బోధించడానికి శిష్ట వ్యావహారికాన్ని వాడడం అన్న మధ్యేమార్గం ప్రస్తుతం అత్యంత అనుసరణీయమైనది అన్న అభిప్రాయానికి వచ్చారు. ఈ గ్రాంధిక వ్యావహారిక భాష అడకత్తెరవలన ఎక్కువ బాధపడుతున్నది. తెలుగు నేర్చుకోబూనిన ఇతర భాషల వారని, వారు పుస్తకాలలో గ్రాంధికం నేర్చుకుని. మాట్లాడబోయేసరికి వ్యావహారికాన్ని ఎదుర్కొని తికమక పడుతున్నారని- తెలుగుభాష వ్యాప్తికి ఈ పరిస్థితిదోహదకారి కాజాలదని ఒక సభ్యుడన్నారు.

(16 మే 69)